# జ్ఞాన విజ్ఞాన, వ్యాకరణ సిద్ధులు వినాయక వాయు కుమారులు









**జం**బూ ఖండం భగవత్ప్రసీతతేజ స్వరూపం. అందున్న భరతఖండం మహాద్భుత అమృతకలశం. హాలహలమును మ్రింగిన ఆ పరమేశుడు అమృతాన్నంతటినీ ఒక కలశంలో పట్టుటకు క్షీరసాగర శయనునికి సహకరించాడు. ఈ గోళాకారమైన విశ్వమంతా లింగ స్వరూపుడై ఉన్నాడు. పన్నగ భూషణుడు, ఆపన్నుల ఆత్మ పరాయణుడు. లింగోద్భవ కాలము (మహాశివరాత్రినాడు) విశ్వమంతటా తన తేజస్సును విస్తరింపచేస్తూ, భక్తినైనా, పరాకునైనా లింగస్వరూపునిపై దళం (మారేడుదళం) తోయం (నీరు), పచ్చని పుష్పం అభిషేకం చేసినవారిని అప్రయత్నంగా చేసినవారికైనను, సకల పాపాలను పోగొట్టి ముక్తిమోక్షాలను అనుగ్రహిస్తున్నందువల్లనే, ఆయన భోళా శంకరునిగా స్తుతింపబడుతున్నాడు.

ఆసేతు హిమాచల పర్యంతమూగల భువిని సుందరంగా, చైతన్యవంతంగా తేజోవంతంగా ఉండడానికి శివశక్తే కారణం. అందుకే శివుణ్ణి సత్యం, శివం, సుందరంగా వర్ణించారు. 'మహాభారతం' ఇతివృత్తంగానీ, 'రామాయణం'లోగానీ శివానుగ్రహ శక్తే ప్రధాన నేపధ్యమై కథనం నడుస్తుంది. ఈ పుటల్లోని వినాయక, ఆంజనేయ శ్రీకృష్ణుల అమితానుసక్తికి శివశక్తే తోడై నిలిచిందని గ్రహించగలరు. శివుడు కల్యాణ కారకేచ్ఛగలవాడు. అందుకే ఆయన హాలాహలాన్ని మ్రింగిన కంఠంలోనే నిమిడింప చేసుకున్నవాడు కాబట్టే నీలకంఠుడని పిలువబడుతున్నాడు.

అమృతం పానం చేసినవాడు దేవుడు హాలాహలాన్ని పానంచేసినవాడిని మహాదేవుడు. విషదోషాలను బయట వారిని బాధించకుండా ఉండడానికి ఆయన విషాన్ని కంఠంలోనే బంధించాడు. క్షీరసాగర మధనంలో వచ్చిన మహాద్భుతాలను అందరూ తనకు తనకుయని తీసుకున్నప్పుడు నశింపచేసే విషాన్ని ఆయన స్వీకరించాడు.

చుక్కల నీలి దుప్పటి ముసుంగున ప్రాణుల రాత్రి వేళలన్। చక్కగ నిదురపుచ్చి తొలిసంజెల మేలి పసిడిమందువా। రెక్కలు మెల్లిగా తెరచి। అందరినీ చల్లగా కాచేది ఆ మహదేవుడే! ఆయన అంశీకుల ఇంకెంతటి దయామయులో వారినిక్కడ ముచ్చటిస్తున్నాను.

**రుద్రపుత్రం వినాయకం! అయంరుద్రావ తారం హనుమంతం। రుద్ర స్వరూపాయ శ్రీకృష్ణమ్ నమః**

-విశ్వమే తానై, విశ్వాన్ని తనలో లీనం చేసుకుని విశ్వవ్యాప్తకుడైన హరుడే హరిగా, హరియే హరునిగా లోక భద్రత, లోకహితం కోరు వందితుడు పరమశివుడు. పర్వతరాజ పుత్రి ప్రాణేశ్వరుడై, సర్వప్రాణకోటికి, సర్వ ప్రకృతీ జనరాశులచే ఆదిదంపతులుగా కొలువబడుతూన్న జగజ్జేయమానుడైన శివునికి ముందుగనే **నమఃపార్వతీపతయే నమః** అని నమస్కరించుకుందాం.

**పా**ర్వతీపరమేశ్వరులు ఆది దంపతులు. ఆది దంపతులైనను తొలి పూజలందుకునే సింధూర వర్ణుడు ద్విభుజుడు, లంబోదరుడూ, గజముఖుడూ, మూషికవాహనుడైన గణపతికి తొలి పూజ తొలి వందనం సమర్పించాల్సి ఉన్నది.

నారదమునేంద్రులవారు: ప్రణమ్య శిరసాదేవం, గౌరీపుత్రం వినాయకం, భక్తావాసం స్మరేన్నిత్యం ఆయుష్కామార్థ సిద్ధయే! ప్రథమం వక్రతుండంచ ఏక దంతం ద్వితీయకమ్! తృతీయం కృష్ణ పింగాక్షం, గజవక్త్రమ్ చతుర్థకమ్, లంబోదరం పంచమంచ, షష్టం వికటమేవచ। సప్తమం విఘ్నరాజంచ, ధూమ్రవర్ణం తథాష్టమమ్! నవమం పాలచంద్రంచ। దశమంతు వినాయకం, ఏకాదశం గణపతిం, ద్వాదశాంతు గజాననం। ద్వాదశైతాని నామాని। త్రిసంధ్యః యస్ఫుపఠేన్నరః నచవిఘ్నభయమ్ తస్యసర్వసిద్ధికరం ప్రభో

-అంటూ ఆ మహర్షి మనసా, వాచా, కర్మణా కొలిచాడు. 'నారాయణ' స్మరణను తక్క అన్యనామస్మరణ చేయని నారదులు ప్రమదగణాధిపతియైన వినాయకుని కొలిస్తే సకల బాధల్నుంచి విముక్తులౌతారని సంకటనాశన గణేశ స్తోత్రమందు వివరించారంటే ఎంతటి మహత్తర మహాత్మమున్నది.

మహాగణపతి తొలి ఆరాధకుడు. శుభాశుభములందుగానీ, ఏ దేవతా వ్రతములందు గానీ గణేశుణ్ణే తొలిగా కొలవాలి మట్టి వినాయకుణ్ణి కొలవాలిగానీ రసాయన రంగులతో వినాయక విగ్రహాలను చేసి కొలవడంతో ప్రకృతీ కాలుష్యం కలుగుతుంది. వినాయకపూజలోని అంతరార్థం ప్రకృతిని పూజించడమని ఎందురెరుగుదురు. గరికెతో అర్చించడం ఆయనకెంతో యిష్టం.

గణనాధుడు కాలాన్ని నడిపేవాడు. కాలానికి అధీనుడు కాడు. దేశకాల పరిధి కావల అంతరాళాల్లో ఆయన ఆవాసుడై ఉంటాడు. పరమవ్యోమ ప్రతిష్టితుడై, సర్వుల గుణదోషాలను తొలగిస్తూ, ప్రాప్త పాప పుణ్యాలూ, సుఖదఃఖాలూ, సంతోషక్లేశాలూ తానే స్వీకరించే అందరినీ రక్షిస్తూంటాడు. ఆయన్ని మనం అన్వేషించనక్కర్లేదు. గరికపోచతో ఆవాహనం చేసి అర్చించినా సంతుష్టి చెంది మనలో ఉంటాడు. మనల్ని అభయహస్తంతో అనుగ్రహిస్తాడు.

**విద్యార్థీ లభతే విద్యాన్। ధనార్థీ లభతే ధనమ్। పుత్రార్థీ లభతే పుత్రాన్। మోక్షార్థీ లభతే మోక్షం।** - ఎవరు ఏవి కోరుకున్నా సిద్ధింపజేసేవాడు వినాయకుడు.

**ప్రణమ్య శిరసాదేవం గౌరీపుత్రం భక్తవాసం స్మరేన్నిత్యం ఆయుష్కామార్థ సిద్ధయే.**

విద్యార్థమై పూజించినపుడు విద్యను లభింపజేయగలడు. ధనార్థియై పూజించినపుడు ధనం లభింపజేస్తాడు. పుత్రుల కోసం ప్రార్థించినపుడు పుత్ర సౌభాగ్యం అనుగ్రహిస్తాడు. మోక్షార్థియై మోక్షం అర్థిస్తూ పూజించినపుడు వినాయకుడు ముక్తీ మోక్షాలనుగ్రహిస్తాడు.

విధవ ఈ జన్మలో పూజించినపుడు వచ్చే జన్మలో వైధవ్యం కలుగకుండా సముంగళత్వాన్ని ప్రసాదిస్తాడు. వీటన్నిటికన్నను విశేషం తలపెట్టిన కార్యం విఘ్నం కాకుండా విజయవంతంగా జరగాలంటే తొలుత వినాయకుణ్ణే మనం పూజించాలి. వినాయకచవితినాడు ఆయన వ్రతం చేసేటప్పుడు కూడా పసుపుతో వినాయకుణ్ణి చేసి సిద్ధివినాయకునిగా పూజించడం భారతీయుల ప్రథమ కర్తవ్యం.



**వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।**
**పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥**
**బ్రహ్మసూత్ర కృతే తస్మై వేదవ్యాసాయ వేధసే ।**
**జ్ఞాన శక్త్యవతారాయ నమో భగవతే హరేః ॥**

వసిష్ఠ మహామునికి మునిమనుమడు. శక్తి మహామునికి మనుమడు, పరాశర మహాముని కుమారుడు, శుకమహర్షికి తండ్రి గొప్ప తపస్సంపన్నుడు, బ్రహ్మసూత్రాలను రచించినవాడు. జ్ఞాన, విజ్ఞానాలకు ప్రతిరూపుడు, సాక్షాత్తు విష్ణు స్వరూపుడైన వ్యాసమహర్షికి నమస్కరిస్తున్నాను.